క్లుప్తంగా

ఎస్‌బీఐ బ్రాంచికి స్థాన చలనం



కొరిటిపాడు: గుంటూరు నగర ప్రజలకు సౌకర్యార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్మీపురం సంయుక్త మాన్షన్, బ్రహ్మంగారి మఠం ఎదురు ఉన్న బ్యాంకు కార్యాలయాన్ని బృందావన్ గార్డెన్స్ 3వ లైనులోకి మార్చినట్లు ఏజీఎం ఎం.వి.వి.సూర్యశేఖర్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని శాఖను గురువారం బ్యాంకు అధికారులతో కలసి ఆయన ప్రారంభించారు. ఖాతాదారులకు సౌకర్యవంతంగా ఉండేలా బ్రాంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాపారస్తులకు రూ. 50 లక్షల నుంచి రూ. 50 కోట్ల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, రీజనల్ మేనేజర్లు టి.తారకేశ్వరరావు, ఎం.విశ్వేశ్వరరావు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: మిర్చి వ్యాపారి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పి.కోటేశ్వరరావు మిర్చి వ్యాపారం చేస్తూ, ఏటీ అగ్రహారం 11వ లైనులో నివసిస్తుంటాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336కు సమాచారం అందించాలని కోరారు.

అభ్యుదయ కాలనీలో మహిళ...

మహిళ అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అభ్యుదయ 1వ లైనులో నివసించే ఓ కుటుంబానికి చెందిన మహిళ ఈనెల 26న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరిపై దాడి

ఇద్దరిపై తొమ్మిది మంది దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన మాసిపోగు నవీన్, అతని స్నేహితుడు బోయపాటి వెంకటేష్ గురువారం శారదా కాలనీ ఆర్చి సెంటర్‌లో ఆటోలో కూర్చొని టీ తాగుతున్నారు. పాత కక్షల నేపథ్యంలో మణికంత, సన్నితో పాటు మరో ఏడుగురు కలసి ఆటో వద్దకు వచ్చారు. నవీన్, వెంకటేష్‌తో గొడవ పడి, ఇటుక రాయితో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష ఆదరణ

- డివిజన్లల్లో అట్టహాసంగా కార్యక్రమం
- ప్రజల నుంచి విశేష స్పందన



మా నమ్మకం నువ్వే జగన్ పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

నగరంపాలెం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి వివిధ డివిజన్ల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రానున్న ఎన్నికల్లోనూ జగనన్నకే తమ మద్దతు ఉంటుందని స్థానికులు స్పష్టం చేశారు. 18వ డివిజన్ ఎత్తు రోడ్డులోని రాజా పిల్లల ఆసుపత్రి వద్ద, 21వ డివిజన్ చుట్టుగుంట కూడలిలో, 22వ డివిజన్ అరవై అడుగుల రోడ్డు పీర్ల చావిడి కూడలిలో, 35వ డివిజన్ పట్టాభిపురంలోని కాంచన టవర్స్, 39వ డివిజన్ గుజ్జనగుండ్ల పార్క్, 44వ డివిజన్ కొరిటిపాడు గాంధీ బొమ్మ కూడలిలో గురువారం ప్రజా మద్దతు కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మేయర్, కార్పొరేటర్లు పుస్తకాలు చేతపట్టి సంతకాల సేకరణ చేపట్టారు. గడప గడపకు వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, ప్రస్తుతం సీఎం జగన్ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాల్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలు తెలుసుకుని, సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న నవరత్నాల పథకాల్ని ప్రజలకు తెలియజేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ జగనన్న మా భవిష్యతు కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లోనూ అధికారం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా లక్షలాది కుటుంబాలను కలసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వార్డు, గృహ సారథులు, ఇన్‌ఛార్జ్, నాయకులతో ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ప్రజా మద్దతు సేకరణ కార్యక్రమాల్ని డివిజన్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాంద్రుగుంట గురవయ్య , గేదెల నాగ రంగమణి , షేక్ జుమ్మాబీ, వంగల హేమలత, 35వ డివిజన్ ఇన్‌చార్జి టీఎల్‌వీ.వీరాంజనేయులు, జేసీఎస్ క్లస్టర్లు గేదెల రమేష్, ఏరువా ఇన్నారెడ్డి , ఉడతా కృష్ణ నాయకులు వంగల వలీవీరారెడ్డి, మార్కెట్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు



విద్యార్థులతో రామకృష్ణమూర్తి, పీఎం ప్రసాద్, మంజుశ్రీ , దుర్గాప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత తెలిపారు. సాంబశివపేటలోని బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థినుల్ని ఆమె అభినందించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని కె. మేఘన 981 మార్కులు సాధించిన ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని షేక్ మెహతాబ్ 978, సీఈసీ విద్యార్థిని ఎస్. హర్షిత 948, హెచ్ఈసీ విద్యార్థిని సీహెచ్ రమ్య 963, ఎంఈసీ విద్యార్థిని పి. కోమల్ కుమారి 962 మార్కులు సాధించినట్లు వివరించారు. జూనియర్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో ఎం. వెంకట గీతాజ్యోతి 438, బైపీసీలో షేక్ రిజ్వానా 418, హెచ్ఈసీలో ఎస్. బ్యూలా హెప్సీబా రాణి 443, సీఈసీలో భవ్య గాయత్రి 434 మార్కులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. గతేడాది ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు నమోదయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని అధ్యాపకులు అభినందించారు.

హిందూ కళాశాల విద్యార్థుల విజయభేరి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో హిందూ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఆ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. మార్కెట్ సెంటర్లోని కళాశాలలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఎంపీసీలో జి. జయదీప్ 975, బైపీసీలో పి. లావణ్య 959, ఎంఈసీలో సీహెచ్ దివ్య 954, సీఈసీలో జి. రవికిరణ్ 796 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో వై. శ్రీగౌరి 459, బైపీసీలో షేక్ నసీమా 412, ఎంఈసీలో డి. దిలీప్ 455, సీఈసీలో సీహెచ్‌కేవీ భరద్వాజ 460 మార్కులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఏ.మంజుశ్రీ , వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ అభినందించారు.

అబార్షన్స్‌పై మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ జయంతి, డాక్టర్ ఝాన్సీవాణి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తగా నియమితులైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు కాంప్రహెన్సివ్ అబార్షన్ కేర్ పైన మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ జయంతి, ప్రొఫెసర్లు డాక్టర్ షర్మిల, డాక్టర్ రజని కుమారి, డాక్టర్ ఝాన్సీ వాణి, డాక్టర్ అనురాధ పలు అంశాలపై మాట్లాడారు. అబార్షన్లు ఎలాంటి పరిస్థితుల్లో చేయాలనే విషయాలపై మెడికల్ ఆఫీసర్లకు వివరించారు. అవాంచిత గర్భాలు, గర్భిణికి ప్రమాదకరమైన పరిస్థితి తలెత్తినప్పుడు, గర్భస్థ శిశువు అంగవైకల్యం ఉన్నప్పుడు, అవివాహిత గర్భం దాల్చినప్పుడు, తల్లి ప్రాణానికి ప్రమాదం ఉన్నప్పుడు, టీనేజ్ గర్భం, లైంగిక దాడికి గురైనప్పుడు, సామాజిక కారణాల వల్ల తల్లి గర్భం వద్దు అనుకున్న సమయాల్లో అబార్షన్ చేయవచ్చని తెలిపారు. ఎంటీపీ చట్టం ద్వారా అబార్షన్ చేయవచ్చని, సురక్షితంగా తల్లికి ఆరోగ్య సమస్యలు రాకుండా అబార్షన్ చేయాలని చెప్పారు. అబార్షన్‌లపై మెడికల్ ఆఫీసర్లకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణను వైద్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు పాల్గొన్నారు.

పూజిత స్కూలులో సందడిగా గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత పబ్లిక్ స్కూల్లో గురువారం కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి ప్రవేశించే చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో అమూల్యమైనదన్నారు. బాల్య దశలో దిశా నిర్దేశం చేసి సరైన మార్గంలో నడిపించడం తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల సమష్టి బాధ్యతని చెప్పారు. పిల్లలు చదువుతో పాటు ఆటపాటలతో ఎదిగినప్పుడే సమగ్ర వికాసం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

కాకుమాను: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. ఇటీవల మండలంలోని తెలగాయపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఎండేటి ప్రసాద్(62)ను గురువారం పాండ్రపాడు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పొన్నూరు కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అభ్యుదయ కళాశాలలో నూతన కోర్సులు ప్రారంభం



ఆడియో విజువల్ స్టూడియోను ప్రారంభిస్తున్న బీఎస్ఆర్కే ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆడియో విజువల్ ప్రొడక్షన్ స్టూడియోను గురువారం అభ్యుదయ విద్యాసంస్థల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడియో విజువల్ స్టూడియో ద్వారా వీఎఫ్ఎక్స్, యాప్ డిజైనింగ్, క్రియేటింగ్ యూట్యూబ్, లైవ్ ఇంటిగ్రేషన్, త్రీడీ యానిమేషన్ డిగ్రీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్పీ ఫ్యాకల్టీ ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఇంటర్ ఫలితాల్లో అభ్యుదయ విద్యార్థినుల ప్రతిభ ఇంటర్ ఫలితాల్లో అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్, బి. రోహిణీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

గాంధీ పార్కును ప్రారంభానికి సిద్ధం చేయండి

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గాంధీ పార్కును త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని, పెండింగ్ పనుల్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. ఆమె గురువారం పనుల్ని తనిఖీ చేసి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. షిఫ్ట్‌ల వారీగా కార్మికుల్ని నియమించుకొని పనుల్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి స్పష్టం చేశారు. పార్కు ప్రధాన కాంపౌండ్ వాల్‌పై అందమైన పెయింటింగ్‌లు వేయించాలని, పార్కింగ్ పనుల్ని కూడా వెంటనే చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పెద్ద చెట్లకు ట్రీ లైటింగ్ చేయాలని డీఈఈని ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఆక్రమణల్ని తొలగించాలని టీపీఎస్‌ను ఆదేశించారు. పనుల పురోగతి మేరకు కాంట్రాక్టర్‌కు బిల్స్ చెల్లించేందుకు నోట్ చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టరే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పార్క్‌లో గ్రీనరి పనులు వేగవంతం చేయాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కల్యాణరావు, ఏడీహెచ్ రామారావు, ఏఈలు రాంబాబు, సునీల్ కుమార్, రవికిరణ్, టీపీఎస్ రసూల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నయన ప్రియ నృత్య ప్రదర్శన



సురేంద్రనాథ్, బిజన




కందాల రోహిణి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో మహా మంజీర నాదం పేరున నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఆలయ సహాయ కార్యదర్శి పి. ప్రభాకరరావు జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం కార్యక్రమాల్ని ప్రారంభించారు.
ప్రముఖ సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆచార్యులు డాక్టర్ భాగవతుల సేతురామ్‌కు సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కందాల రోహిణి, మురమళ్ల సురేంద్రనాథ్, బిజిన దంపతులు, తిరుపతికి చెందిన కొండ శ్రీ నయనప్రియ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. కార్యక్రమాన్ని పసుమర్తి నాగమోహిని పర్యవేక్షించారు.

వేసవిలో వేధించే కిడ్నీలో రాళ్లు

- నీరు సరిగా తాగకపోతే ఏర్పడే ప్రమాదం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
- వారసత్వంగా వచ్చే అవకాశం
- అందుబాటులో ఆధునిక వైద్యం



కిడ్నీలో రాయిని తొలగించే ఆపరేషన్

గుంటూరు మెడికల్: వేసవిలో ఎండ తీవ్రతకకు శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం, దాన్ని భర్తీ చేసేందుకు సరిపడా నీరు తాగకపోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి నిర్లక్ష్యం పెను ప్రమాదానికి దారి తీస్తుంది. రాళ్ల సైజు పెరిగే కొద్దీ బాధ కూడా పెరిగిపోతూ మనిషిని కూర్చోనీయకుండా, పడుకోనీయకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యంపై 'సాక్షి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

రాళ్లు ఏర్పడడానికి కారణాలు

వేసవిలో సరిపడా మంచినీరు తాగకపోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే మిగతా వారు కూడా ఏ మాత్రం ఆలోచించకుండా మూత్రపిండాల పరీక్ష చేయించుకోవడం చాలా ఉత్తమం. వారసత్వంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. పుట్టుకతో కిడ్నీలో తేడాలు, శరీరం తీరు కూడా రాళ్లు ఏర్పడడానికి ఒక కారణం.

వయస్సులో సంబంధం లేదు

కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి వయస్సుతో సంబంధం లేదు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరిలో కూడా ఏర్పడతాయి. ముఖ్యంగా 22 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు వారిలో హార్మోనుల్లో తేడాల వల్ల ఏర్పడతాయి. మూడు మిల్లీమీటర్ల నుంచి కిడ్నీ సైజు వరకు వస్తాయి. రాళ్లు వచ్చిన వారికి నడుము పక్కన నొప్పి, జ్వరం వస్తుంది. మూత్రంలో రక్తం కారడం, వాంతులు అవడం, నొప్పి వచ్చిన సమయంలో మనిషిని మెలేసినట్లుగా ఉంటుంది.

రోగులు పాటించాల్సిన సూచనలు ఇవి

- రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకున్న వారు జాగ్రత్తలు తీసుకోకపోతే మరలా ఐదేళ్లలో వచ్చే ప్రమాదం ఉంది.
- ఆపరేషన్ చేయించుకున్నవారు ఆహార నియమాలు పాటించాలి.
- కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా పొటాషియం, మెగ్నీషియం లభించి మూత్ర పిండాల్లో తిరిగి రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చు.
- క్యారెట్లు, కాకరకాయ తీసుకోవడం వల్ల మినరల్స్ పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయి.
- అరటి పండ్లు తినడం ద్వారా ఆక్సాలిక్ యాసిడ్ విభజన చెంది రాళ్లు ఏర్పడడాన్ని నివారిస్తుంది.
- అనాస పండు రసం, బార్లి, ఓట్లు, నిమ్మరసం తాగడం వల్ల సైట్రైట్‌లు పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా దోహదం చేస్తాయి.
- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజూ మూడు లీటర్ల నీరు తాగాలి.

అందుబాటులో ఆధునిక వైద్య పద్ధతులు



కిడ్నీలో రాళ్లను తొలగించేందుకు నేడు ఎన్నో వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఒక సెంటీమీటర్ కన్నా తక్కువ సైజులో ఉండే వాటికి ఆపరేషన్ అవసరం లేదు. నీరు ఎక్కువగా తాగడం వల్ల మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. పెద్దగా ఉంటే 'ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లితోట్రిప్సి' (ఈఎస్‌డబ్ల్యూ), పరిక్యూటేలియస్ నెఫ్రో లితాటమి (పీసీఎన్ఎల్), లేజర్ ట్రీట్‌మెంట్ రిట్రోగ్రేడ్, ఇంట్రారీనల్ సర్జరీ (ఆర్ఐఆర్ఎస్) అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం వివిధ రకాల మూత్ర సంబంధిత సమస్యలతో 200 మంది చికిత్స కోసం వస్తున్నారు. వారిలో 100 మంది రాళ్లు ఏర్పడి ఇబ్బంది పడుతున్నవారే. మూత్ర పిండాల సమస్యలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించే అత్యాధునిక వైద్య సేవలు, ఆపరేషన్లు పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నాం.

–డాక్టర్ మొహసిన్ ఖాదిరి, యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్

షేక్‌స్పియర్ రచనలు అజరామరం



నాగ మాధురిని సత్కరిస్తున్న రామకృష్ణమూర్తి, ప్రసాద్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్ల రచయిత, కవి, విలియం షేక్‌స్పియర్ సాహిత్యం అజరామరమని, విద్యార్థుల మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జె.నాగమాధురి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో గురువారం ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో ఆయన జయంతి సందర్భంగా డాక్టర్ నాగ మాధురి అతిథి ఉపన్యాసమిచ్చారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ షేక్‌స్పియర్ రచనల ప్రభావంతో ఆంగ్ల భాష ఔన్నత్యాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఏవో కాళిదాసు, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బాలశౌరి, అధ్యాపకులు డాక్టర్ నవీన్ కుమార్, ఈ. సుదర్శన్, సీహెచ్. అరుణ, వి. బ్యూలారాణి, డాక్టర్ విజయరత్న కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

వినూత్న బోధనతో విద్యార్థుల అగ్రస్థానం



విద్యార్థులతో చక్రనాగ్, కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: బోధనలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టి విద్యార్థుల్ని మేధోవంతులుగా తీర్చిదిద్దవచ్చని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్.చక్రనాగ్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో గురువారం ఏరోడెక్స్ ఐఐటీ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 6,7,8 తరగతుల విద్యార్థులకు ఫిజిక్స్, మాథమెటిక్స్‌లో ఐదు నెలలు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చక్రనాగ్ మాట్లాడుతూ సంప్రదాయ బోధనలకు విభిన్నంగా నూతన శాస్త్రీయ విద్యా విధానం ద్వారా గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏరోడెక్స్ సంస్థ ప్రతినిధి ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.